

ఉష్ణోగ్రత

గరిష్ఠం 40.9

కనిష్ఠం 20.8



కాచారంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్రం కుట్రలను తిప్పికొడదాం

» కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కేంద్రం కుట్రలను తిప్పి కొడదామని.. రాజ్యాంగ సవరణ ప్రయత్నాల వల్ల రిజర్వేషన్లకు ముప్పు ఉందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జల్‌పల్లి నరేందర్ అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని రాయన్నగూడ, కాచారం గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ కోసం గ్రామ గ్రామాన తిరిగి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నరేందర్ తెలిపారు. పలు రాజ్యాంగ సవరణ పేరిట కొన్ని కులాల రిజర్వేషన్లను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని.. దీనిని యావత్ దేశం ఖండించాలని పిలుపునిచ్చారు. నీరటి రాజు, మంజుల భిక్షపతి, సత్తయ్య, జగన్నాథం, ఇస్తారి, సింహారెడ్డి, రామస్వామి సుకుమార్, సుధాకర్‌యాదవ్, సులోచన, బంగారం కుమార్, సలీం తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మహిళా హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు ఉధృతం


» ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, బలహీన వర్గాల మహిళల హక్కుల కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిబా ఫూలే, అంబేడ్కర్‌ల స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జాతీయ నాయకురాలు టి.జ్యోతి పిలుపునిచ్చారు. ఈ నెల 14న ప్రారంభమైన మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర ముగింపు సభ ఆదివారం ఇబ్రహీంపట్నంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో మహిళలకు భద్రత కరువైందని మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు కొనసాగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కుల దురహంకార హత్యలు ఎక్కువయ్యాయని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మహిళల పాత్ర మరువలేనిదనే విషయం గుర్తెరుగాలన్నారు. కేంద్రంలో మోదీ పాలనలో భారత రాజ్యాంగం, మహిళల హక్కులను పక్కనపెట్టే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 'బేటీ బచావో.. బేటీ పఢావో' మాటలకే పరిమితమైందన్నారు. మహిళలు మూఢ నమ్మకాలను విడనాడాలని, హక్కుల పరిరక్షణకోసం పోరాటం చేయాలంలూ వారు పిలుపునిచ్చారు. తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వాటి అమలులో విఫలమైందని విమర్శించారు. మున్సిపల్, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. కులాంతర వివాహాల రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు అరుణజ్యోతి, సహాయ కార్యదర్శులు అశాలత, సరళతోపాటు నాగలక్ష్మి, కవిత, సుమలత, అరుణ, ఇందిర, మున్నీ తదితరులున్నారు.

ఏఐకేఎస్‌ఎన్‌సీ మెంబర్‌గా ప్రభులింగం



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా చేవెళ్లకు చెందిన ప్రభులింగం ఎన్నికయ్యారు. ఏఐకేఎస్ జాతీయ మహాసభలో భాగంగా తమిళనాడులోని నాగపట్నంలో జరిగిన ఈ సభల్లో ఆయనను ఎన్నుకున్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం తాను పోరాడుతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



లక్ష్యం చేరేనా?

ఈ సారి ఎండలు విపరీతంగా కొడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. సాగు చేసిన వరిని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ధాన్యం సేకరణ లక్ష్యం తక్కువగానే ఉన్నప్పటికీ దానిని అధిగమించడం కష్టమే. ఇప్పటికే జిల్లాలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. పంటలు ఎండిపోతుండటంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. పంటలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. నీటి లభ్యత లేకపోవడంతో వరి దిగుబడి తక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. చేతికొచ్చిన కాస్త ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు ముందుకు వస్తారా అనే విషయం అనుమానంగా ఉంది.

కొనుగోలు కేంద్రాలు ఓపెన్!

ధాన్యం సేకరణకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 30 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- 38 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 12 కేంద్రాలు ప్రారంభం
- సెంటర్లలో పకడ్బందీ ఏర్పాట్లు
- జోరుగా కొనసాగుతున్న వరి కోతలు

యాసంగి వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం జిల్లాలో 38 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటికే 12 కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ఇబ్బంది పడకుండా కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు గుబులు రేపుతున్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే గతేడాది మాదిరిగానే ధాన్యం సేకరణలో లక్ష్యాన్ని చేరే సూచనలు కనిపించడం లేదు. ఎండ తీవ్రతకు నీటి లభ్యత తక్కువగా ఉండటంతో దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. దీంతో యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల శాఖ సిద్ధమైంది. ధాన్యం సేకరణకు అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. కొనుగోళ్లకు అవసరమయ్యే సామగ్రి అందుబాటులో ఉంచే ఏర్పాట్లపై దృష్టిసారించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 95,134 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. సాగుకు అనుగుణంగా దిగుబడిపై పౌర సరఫరాల శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. మొత్తం 38 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐకేపీ ద్వారా మూడు,

మిగతా 8వ పేజీలో...



నెలాఖరు వరకు కేంద్రాలకు ధాన్యం

జిల్లాలో వరి పంట ఆలస్యంగా వేశారు. వరి కోతలు ఊపందుకున్నాయి. ధాన్యం సేకరణకు జిల్లాలో 38 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 12 కేంద్రాలను ప్రారంభించాం. మిగతావి త్వరలోనే తెరిచేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం క్వింటాల్ వరికి గ్రేడ్-ఏ రకానికి రూ.2300, సాధారణ రకానికి రూ.2300 చెల్లిస్తాం. సన్న వడ్లకు అదనంగా క్వింటాకు రూ.500 అందిస్తాం. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

- గోపికృష్ణ, పౌరసరఫరాల శాఖ అధికారి



అతిథి గృహానికి నోచని ఆమనగల్లు

- చొరవ చూపని నేతలు
- అతిథులు, అధికారులకు తప్పని ఇబ్బందులు

8

మహేశ్వరంలో మట్టి మాఫియా

యథేచ్ఛగా తవ్వకాలు

- అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల నుంచి తరలింపు
- నిబంధనలకు తూట్లు పొడుస్తున్న అక్రమార్కులు
- భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమవుతున్న రోడ్లు

మహేశ్వరంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. కొందరు అక్రమార్కులు నిబంధనలను బేఖాతర్ చేస్తూ మట్టి దందా నిర్వహిస్తున్నారు. మనల్నెవ్వరా ఆపేది అనే తరహాలో పెట్రేగిపోతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టానుసారం మట్టిని తరలిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. అసైన్డ్, ఫారెస్టు భూములు, చెరువులు, కుంటల్లో దేనినీ వదలడం లేదు. యథేచ్ఛగా మట్టిని తవ్వి భారీ వాహనాల్లో తరలిస్తూ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే బడా బాబుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్నారు.



తుమ్మలూరులోని అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు(ఫైల్)

మహేశ్వరం, ఏప్రిల్ 20 : చెరువు, కుంటలతో పాటు ప్రభుత్వ, ఫారెస్ట్, అసైన్డ్ భూముల పరిరక్షణకు ప్రభుత్వం ఎన్ని చట్టాలు రూపొందించినా అవి అక్రమార్కులకు చుట్టాలే అనే విధంగా మహేశ్వరం మండలంలో మట్టి వ్యాపారం కొనసాగుతోంది. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ రైతులకు అంతోఇంతో ఇచ్చి అక్రమంగా మట్టిని తరలిస్తూ కొందరు కోట్లు గడిస్తున్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె, కోళ్లపడకల్, అమీర్‌పేట, గొల్లూరు, సుభాన్‌పూర్, మొహబ్బత్‌నగర్, పోరండ్ల, పెండ్యాల, ఉప్పుగడ్డతండా, కేసీతండా, నందుపల్లి, రావిరాల, సర్దార్‌నగర్, మంఖాల్, హర్షగూడ, సిరిగిరిపురం, దుబ్బచర్ల, తుమ్మలూరు గ్రామంలోని సర్వే నంబర్లు 315, 107లలో వంద మందికి

మిగతా 8వ పేజీలో...



తుమ్మలూరు నుంచి ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

అనుమతులు లేకుంటే చర్యలు

మండలంలోని ప్రభుత్వ, సీలింగ్ భూములు, చెరువులు, కుంటల్లోంచి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే సహించేది లేదు. ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం. మట్టిని అక్రమంగా తలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు.

- సైదులు, తహసీల్దార్, మహేశ్వరం మండలం



రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

ఇబ్రహీంపట్నం మండల పరిధి ఎలిమినేడు-కందుకూరు మండలం కొలన్‌గూడల మధ్య బీటీ రోడ్డు కంకర తేలి పాడైపోయింది. నాలుగు కిలోమీటర్ల పొడవునా రోడ్డుపై వాహనాలు వెళ్లడం కష్టంగా ఉంది. వాహనాలు వెళ్తున్న సమయంలో రోడ్డు పక్కన నడిచేవారికి కంకర రాళ్లు తగిలే ప్రమాదం ఉండడంతో ఆచితూచి నడవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి రీబీటీగా మార్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

- ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి)

ఈదురు గాలుల వాన

దెబ్బతిన్న పంటలు

- నేలరాలిన వరి ధాన్యం
- ఎగిరిపడిన ఇంటిపై రేకులు
- పిడుగుపాటుకు జీవాల మృతి



లేమూరులో ఈదురు గాలికి దెబ్బతిన్న బొప్పాయి తోట

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఆదివారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం కలెక్టరేట్ వద్ద అత్యధికంగా 22.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మూడు చింతలపల్లిలో 21.0 మిల్లీమీటర్లు, కీసరలో 8.8 మిల్లీమీటర్లు, అల్వాల్‌లో 5.3 మిల్లీమీటర్లు, కూకట్‌పల్లిలోని బాలాజీ నగర్‌లో 4.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నల్లవెల్లిలో 21.0 మిల్లీమీటర్లు, తలకొండపల్లి మండలం వెల్జాల్‌లో 14.3 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.



యాచారం మండలం మల్కీజ్‌గూడలో ఈదురు గాలులకు ధ్వంసమైన ఇంటి రేకులు

యాచారం మండలంలో...

యాచారం : మండల పరిధిలోని మాల్, మేడిపల్లి, నానక్‌నగర్, గొల్లగూడ, తాటిపర్తి గ్రామాలలో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలుల వీచడంతో వరి ధాన్యం నేలరాలాయి. మల్కీజ్‌గూడలో

మిగతా 8వ పేజీలో...

మాల్ పంచాయతీకి జాతీయ పురస్కారం

గ్రామాభివృద్ధికి గుర్తింపుగా ఆత్మనిర్భర్ ప్రత్యేక అవార్డు

యాచారం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పంచాయతీ సాధించిన అభివృద్ధికి గుర్తింపుగా ఆత్మనిర్భర్ పంచాయత్ విభాగంలో 2024-25 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్రంలో మాల్ గ్రామపంచాయతీని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రాష్ట్రంలోనే ఈ అవార్డు పొందిన ఏకైక పంచాయతీ మాల్ కావడం విశేషం



మాల్‌లో నిర్మించిన డంపింగ్ యార్డు

అభివృద్ధిలో పరుగులు

మాల్ గ్రామపంచాయతీ అభివృద్ధిలో ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, పన్నుల ద్వారా ప్రతీ సంవత్సరం వచ్చే రూ.94లక్షల ఆదాయంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పంచాయతీలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం, హరితహారం కింద మొక్కల పెంపకం, నర్సరీ నిర్వహణ, డంపింగ్ యార్డు తదితర అభివృద్ధి పనులు ఇటీవల పర్యటించిన కేంద్ర బృందాన్ని మెప్పించాయి. పంచాయతీ రికార్డులు పరిశీలించడంతో పాటు ప్రజల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. జిల్లా అధికారులతో విచారించి గ్రామాన్ని ఆత్మనిర్భర్ విభాగంలో తెలంగాణ రాష్ట్రంలోనే మాల్‌ను ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేశారు. ఈ అవార్డు కింద పంచాయతీకి రూ.కోటి నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిసింది. తాను ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలోని మాల్ గ్రామపంచాయతీకి ఆత్మనిర్భర్ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.

చాలా గర్వంగా ఉంది



రాష్ట్రంలోనే మాల్ గ్రామపంచాయతీని ఆత్మనిర్భర్ విభాగంలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం చాలా గర్వంగా ఉంది. పంచాయతీ కార్యదర్శితో పాటు సిబ్బంది నిరంతరం ప్రజలకు వసతుల కల్పనకు చొరవ తీసుకున్నారు. జనం నుంచి వసూలు చేసిన పన్నులు, సంత ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం. ఈ విషయంలో అధికారుల కృషి కూడా ఉంది.

జి.నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో, యాచారం



మొయినాబాద్ చర్చిలో ఏసు గీతాలు ఆలపిస్తున్న యువతులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

మొయినాబాద్ మండలంలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి ఆయా గ్రామాల్లోని చర్చిలకు క్రైస్తవులు తరలివెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు మరణించి పునరుద్ధానుడై తిరిగి లేచిన సన్నివేశాలను మండలంలోని ఆయా చర్చిల వద్ద ప్రత్యేకంగా నిర్వాహకులు ప్రదర్శించారు.

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి)

పార్కు స్థలానికి ఎసరు!

నిద్రమత్తులో టౌన్‌ప్లానింగ్ విభాగం.. ప్రత్యేకాధికారుల పాలనలో పట్టింపు కరువు


అక్రమార్కులు చదును చేసిన పార్కు స్థలం

తాండూరు, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల విలువైన స్థలాలు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తాండూరు మున్సిపాలిటీలో పలు పార్కు స్థలాలు కబ్జాకు గురై కోర్టులో కేసులు కొనసాగుతున్నాయి. అయినా స్థలాల పరిరక్షణలో మున్సిపాలిటీలు అధికారుల పట్టింపు లేక పోవడంతో కబ్జాల పరంపర కొనసాగుతోంది. తాజాగా చించోళి రోడ్డు మార్గంలోని బాలాజీ నగర్‌లోని పార్కు స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఏకంగా మున్సిపల్ పార్కు స్థలంలో జేసీబీతో ముళ్ల పొదలను తొలగించి కబ్జా చేసే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న బాలాజీనగర్ కాలనీవాసులు కబ్జాను అడ్డుకున్నారు. ఈస్థలం విలువ దాదాపు రూ.అరకోటి ఉంటుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఈ స్థలం ప్రైవేటు వ్యక్తులు ఇంకా డబ్బాను వేసి అలాగే వదిలేశారు. ఈడబ్బాను మున్సిపల్ అధికారులు తొలగించలేదు. దీంతో మున్సిపల్ అధికారులు పరోక్షంగా ఈ కబ్జాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరిగినా ఈ పార్కు పరిరక్షణకు తాత్కాలికంగా అయినా మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోకుండా మిన్నకున్నారంటే రాజకీయ ఒత్తిళ్లే కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకాధికారుల పాలనలోనూ మున్సిపాలిటీ స్థలాలు కబ్జాకు గురవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని బాలాజీ నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.

తాండూరు నుంచి అంతర్రాష్ట్ర సర్వీసులు

● రవాణా శాఖ మంత్రితో మాట్లాడిన ఎమ్మెల్యే

తాండూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తాండూరు ఆర్టీసీ డిపో నుంచి అంతర్రాష్ట్ర సర్వీసులను నడిపించేందుకు కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తాండూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ సురేష్ కుమార్ అంతర్రాష్ట్ర సర్వీసులు తాండూరు నుంచి నడిపించేందుకు ఉన్నతాధికారులతో చర్చించాలని, ఇక్కడినుంచి బీదర్, యాద్గిర్ సర్వీసుల కోసం డిమాండ్ ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని మంత్రిని కోరగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వసుజాత, పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల తదితరులు ఉన్నారు.


మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మూగజీవాలకు నీటి సదుపాయం

● శ్రీరాములవారి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

తాండూరురూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చొరవతో మూగజీవాలకు నీటి సదుపాయం ఏర్పడింది. మండలంలోని జినుగుర్తి గ్రామ శివారులోని శ్రీరాములవారి ప్రాజెక్టులో ఉన్న నీటిని వదిలితే మూగజీవాల దాహం తీరుతుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించిన విషయం తెలిసిందే.


ప్రాజెక్టు నుంచి కాల్వలోకి వస్తున్న నీరు

దీంతో ఇరిగేషన్‌శాఖ అధికారులు వెంటనే ఆదిశగా చర్యలు చేపట్టారు. ఆదివారం ఇరిగేషన్ ప్రతినిధి పాషా ప్రాజెక్టు వద్దకు వెళ్లి నీటిని విడుదల చేశారు. జినుగుర్తి గ్రామంతో పాటు కొత్లాపూర్, సంగెంకలాన్, మల్కాపూర్, ఉద్దండాపూర్ తదితర గ్రామాల్లో మూగజీవాలకు దప్పిక తీరనుంది. కాల్వలు కొంత మేరకు పూడుకుపోయినప్పటికీ నీరు సంగెంకలాన్ గ్రామ శివారులోని రాళ్లఘనాపురం చెక్ డ్యాంలోకి చేరనుంది.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో హరీశ్‌రావు, మల్లారెడ్డి, తదితరులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పోచారంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, రేణుకఎల్లమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. స్థానిక బీఆర్‌ఎస్ నేత బద్దం జగన్‌మోహన్‌రెడ్డి సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మించాడు. నిర్మాణం పూర్తి కావడంతో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రిహరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయాన్ని నిర్మించిన జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బోయపల్లి కొండల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జక్క వెంకట్‌రెడ్డి, మంద సంజీవరెడ్డి, రెడ్డియా నాయక్, శ్రీనివాస్, రమేష్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కాగా, అమ్మవార్లను మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

యాస, భాషలను మరవొద్దు

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి


తనబ్బి పుస్తకాన్ని అవిష్కరిస్తున్న ప్రముఖులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):మన తెలంగాణ యాస, భాషలను భవిష్యత్ తరాలకు అందించాలని, వాటిని ఎప్పటికీ మరువద్దని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి తెలిపారు. అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ (మహేంద్ర హిల్స్) గురుకుల డిగ్రీ కళాశాల అధ్యపకురాలు శ్రీభాష్యం అనురాధ రచించిన 'తనబ్బి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాటి పాత పదాలను జోడించి తనబ్బి పుస్తకాన్ని రచించిన అనురాధను కొనియాడారు. కార్యక్రమంలో సహస్రకవి సమూహాం అధ్యక్షుడు మేక రవీంద్ర, మహిళా భారతి అధ్యక్షురాలు దాసోజు పద్మావతి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత, తెలుగు అధ్యాపకురాలు అసిరెడ్డి లక్ష్మి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలి: బక్కని


రామలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న బక్కని నర్సింహులు, టీడీపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా ఉంటూ ప్రజాసేవలో కొనసాగాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఆకాంక్షించారు. చంద్రబాబు 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారంఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరం పుణ్యక్షేత్రంలో గల రామలింగేశ్వరుడికి అభిషేకం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలు, అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలు మరువలేనివన్నారు. నాయకులు లింగారం కుమార్‌గౌడ్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, గంధం ఆనంద్, ఆన్మారి వెంకటయ్య, బూర్గుల వెంకటయ్య, యాదయ్య, బాబునాయక్, శ్రీనివాస్, ఆనంతం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ సర్పంచ్


కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నరోత్తంరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి ఆదివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి అధికారంలోకి వచ్చేలా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు నరోత్తంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.


చేవెళ్లలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, చేవెళ్ల ప్రాంతం అగ్నిప్రమాద రహిత ప్రదేశంగా ఉండేలా అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తోందని చేవెళ్ల ఫైర్ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ప్రజలకు అగ్ని ప్రమాదాల నుంచి ఎలా రక్షించుకోవాలో సిబ్బంది మరింత అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. గ్యాస్ సిలిండర్లు ఉన్న చోట, పెట్రోల్ బంకుల్లో చాలా జగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ స్టిబ్బంది ప్రశాంత్‌కుమార్, సాయిలు, యూనస్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ కమిటీతో సమస్యను పరిష్కరిస్తాం

మోమిన్‌పేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ కమిటీ ఏర్పాటుతో సమస్యను పరిష్కరిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన 'అనంతుడికి ఎసరు!' అనే కథనానికి స్పందించిన ఆయన మోమిన్‌పేట్ మండలంలోని మొరంగపల్లి శివారులో గల అనంత పద్మనాభ స్వామి దేవాలయ వివాదాస్పద భూమిని బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. మోమిన్‌పేట్, మొరంగపల్లి శివారులో గల ఆలయ భూమి వివాదం విషయం గురించి భూమికి సంబంధించిన వివరాలను గ్రామస్థులతో అడిగి తెలుసుకున్నారు. అందరి సూచనల మేరకు దేవాలయ కమిటీ ఏర్పాటుతో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.


ఉత్తమ గాయకుడు, సేవారత్న అవార్డు అందుకుంటున్న నానిగల్ల ప్రవీణ్‌కుమార్

సేవారత్న అవార్డు ప్రదానం

శామీర్‌పేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తూకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌కు చెందిన హ్యూమన్ రైట్స్, పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ జాతీయ కార్యదర్శి నానిగల్ల ప్రవీణ్‌కుమార్ ఉత్తమ గాయకుడు, సేవారత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్‌ను పర్యాటకశాఖ మాజీ చైర్మన్ ఉప్పుల శ్రీనివాస్‌గుప్తా, సంగారెడ్డి జిల్లాఅదనపు మెజిస్ట్రేట్ గొట్టిముక్కుల పద్మజారాణి, రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి, సుప్రీంకోర్టు అడ్వకేట్ నేరెల్ల మాలయాద్రిలు అభినందిస్తూ ఉత్తమ గాయకుడు, సేవారత్న అవార్డును అందజేశారు.



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీటీరోడ్డు పనులకు భూమిపూజ

దుద్యాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్ రంకుల మసీదు నుంచి దుద్యాల మండలం సమీకృత భవన సముదాయం వరకు 3.6కిలో మీటర్ల మేర రూ.4 కోట్ల 98 లక్షలతో చేపట్టే బీటీ రోడ్డు పనులను కాంగ్రెస్ కొడంగల్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ ఆదివారం పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, మల్లేశం, భీములుయాదవ్, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ ఖాజ, ముజీబ్, కృష్ణ, శ్రీశైలంగౌడ్, ఖలీల్ పాష, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గంలోని హస్నాబాద్ గ్రామలంపరంగుల మసీద్ నుంచి దుద్యాల వరకు బీటీ రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ప్రభుత్వం బీటీ రోడ్డుకు నిధులు మంజూర్ చేయడంతో గ్రామస్థులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

జీపీ భవనం.. అందుబాటులోకి వచ్చేదెన్నడో?



బషీరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిగ ఖుర్దు గ్రామంలో నూతనంగా నిర్మించిన జీపీ భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని 2023లో ఉపాధిహామీ పథకం కింద రూ.20లక్షల నిధులతో నిర్మించారు. చిన్న, చిన్న పనులు మినహా భవనం నిర్మాణం పనులు ఎట్టకేలకు పూర్తి చేశారు. ఈ భవన నిర్మాణం పూర్తయి దాదాపు రెండేళ్లవుతున్న పట్టించుకునేవారు కరువయ్యారు ప్రస్తుతం పంచాయతీలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండటంతో ఈ భవనం వైపు ఎవరూ కూడా కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఆటో స్టాండ్ కాదు.. బస్టాండే!


కీసర బస్టాండ్‌లో ఇష్టానుసారంగా ఆటోలను నిలిపిన డ్రైవర్లు

ఇష్టానుసారంగా ఆటోల నిలిపివేత.. ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

కీసర, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మేజర్ వార్డు అయిన కీసర బస్టాండ్ ఆటోస్టాండ్‌ను తలపిస్తోంది. ప్రయాణికులు బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆటోలను ఇష్టానుసారంగా నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వివరాల్లోకి వెళ్తే.. దమ్మాయిగూడ మేజర్ వార్డు అయిన కీసర బస్టాండ్ ప్రాంతం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రద్దీగా ఉంటుంది. గత ఐదారు సంవత్సరాలతో పోల్చుకుంటే కీసరలో రద్దీ పెరిగింది, వాహనాదారులు అధిక సంఖ్యల్లో కీసర ప్రధాన రహదారి గుండా అటు యాదగిరిగుట్ట, బొమ్మలరామారం, తుర్కపల్లి, తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, అదే విధంగా కీసర నుంచి కుషాయిగూడ, ఈసీఐఎల్, సికింద్రాబాద్ ప్రాంతాలకు ఎక్కువగా వెళ్తుంటారు. అదేవిధంగా పర్వదినాలు, శని, ఆది, సోమవారాల్లో రద్దీ మరింత తీవ్రంగా ఉంటుంది. అయితే ఈ రద్దీ కారణంగా ప్రయాణికులు బస్టాండ్‌లో కనీసం నిలబడే పరిస్థితి కూడా ఉండదు. దీనికి తోడు బస్టాండ్ ప్రాంగణంలో ఆటోవాలాలతో ప్రయాణికులకు ఇబ్బందులు

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు నానా ఇబ్బంది పడుతున్నారు.

అసలు సమస్య ఇది


బస్సును ఓవర్ టేక్ చేస్తున్న వాహనదారులు

అసలు కీసర బస్టాండ్‌లో ఆటోల పార్కింగ్ వల్ల సమస్య ఇలా ఉత్పన్నమవుతోంది. కీసర బస్టాండ్‌లో ఆటోలు దాదాపు 20 నుంచి 25వరకు ఆటో ఉన్నాయి. డ్రైవర్లు తమ ఆటోలను ఇష్టానుసారంగా బస్టాండ్‌లో పార్కింగ్ చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు సమన్వయం చేసుకొని సీరియల్ ప్రకారం ప్రయాణికులు ఆటోలో అధిక సంఖ్యల్లో ఎక్కిన తర్వాత కుషాయిగూడ, ఇసీఐఎల్‌కు వెళ్తుంటారు. ఇదే సమయంలో ఏదైనా ఆర్టీసీ బస్సు వస్తే ఆటోలను ఓవర్‌టేక్ చేసి రోడ్డుపై బస్సు డ్రైవర్లు అవుతుంటారు. దీంతో అటుగా వచ్చే వాహనదారులు బస్సును ఓవర్‌టేక్ చేసి ముందుకు వస్తుంటారు. దీంతో బొమ్మలారామారం వైపు వెళ్లే వాహనదారులకు ఎదురుగా వాహనాలు రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ముఖ్యంగా శని, ఆదివారాల్లో అధిక సంఖ్యల్లో అటు, ఇటు రాకపోకలు సాగిస్తుంటారు. సోమవారం కీసరలో జరిగే సంతతో సమస్య ఇంకా పెరుగుతుంది. ఇదే కాకుండా పర్వదినాలు, కార్తీక మాసం, శ్రావణమాసంలో భక్తులు అధిక సంఖ్యల్లో కీసరగుట్టకు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రైవేట్ కార్యక్రమాలు, విజయోత్సవ ర్యాలీలు, ధర్నాలు, జయంతి, వర్ధంతి కార్యక్రమాలు, నిర్వహించాలన్నా కీసర ప్రధాన చౌరస్తా అడ్డాగా మారడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది.

పట్టించుకోని అధికారులు

కీసర ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ పెరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. బస్టాండ్‌లో ఇష్టానుసారంగా ఆటోలు, వాహనాలు పార్కింగ్ చేస్తున్న వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రయాణికులు ఆటోస్టాండ్ వల్లనానా ఇబ్బందులు పడుతున్నా తమకేం పట్టన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. రోజూ కాకపోయినా వారంలో శని, ఆది, సోమవారాల్లో బస్టాండ్‌లో ఆటోలు నిలపకుండా, వాహనాలు నిలపకుండా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకుంటే ఇలాంటి దుస్థితి కీసర బస్టాండ్‌లో కనపడదు.

లింకు రోడ్లకు మహర్దశ


నీళ్లపల్లి శివారులో కొనసాగుతున్న పనులు

బషీరాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యాలాల టూ కొడంగల్ వయా బషీరాబాద్ మండలంలోని మైల్వార్ వరకు గల లింకు రోడ్లకు మహర్దశ పట్టుకుంది. ఈ రోడ్ల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్(ప్రత్యేకాభివృద్ధి నిధులు) రూ.55కోట్లు మంజూరు కావడంతో డబుల్ రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. తాండూరు-కొడంగల్ మధ్య నూతనంగా కొనసాగుతున్న జాతీయ రహదారి పక్కన యాలాల మండలం జుంటుపల్లి ఆలయ కమాన్ నుంచి బండమీదిపల్లి, పగిడిపల్లి, కొడంగల్ మండలం నాగరం, రుద్రారం నుంచి బషీరాబాద్ మండలం నీళ్లపల్లి మీదుగా మైల్వార్ వరకు 23.9కిలోమీటర్ల సింగిల్ రోడ్లను డబుల్ రోడ్డుగా మార్చబోతున్నారు. ఇప్పటికే ఈ రోడ్డు వెడల్పుకు ఇరువైపుల చదను పనులు హిటచీ యంత్రాలతో ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ లింకు రోడ్లను డబుల్ రోడ్డుగా మార్చడంతో మూడు మండలాల మధ్య గ్రామాల్లోని ప్రజలకు దూర భారం తగ్గడమే కాకుండా రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ఈ డబుల్ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలుసంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ సిటిజన్ల అనుభవాలను పంచుకోవాలి

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లతో వారి అనుభవాలను పంచుకొని.. సలహాలు, సూచనలు పాటించే వారు గొప్పగా ఎదుగుతారని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 9వ వార్డులోగల మల్లిఖార్జున కాలనీ పార్కులో కాంగ్రెస్ ఇన్‌చార్జి గోదా మాధవులు ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రతీరోజు నడక, సేద తీరడం కోసం వచ్చే సీనియర్ సిటిజన్లను దృష్టిలో పెట్టుకుని సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసిన మాధవులను ఎమ్మెల్యే అభినందించారు. నేటి యువత సైతం సీనియర్ సిటిజన్ల అనుభవాలను తెలుసుకుంటూ ముందుకు సాగితే ఆశించిన స్థాయికి ఎదుగుతారని ఎమ్మెల్యే శంకర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, కేకే కృష్ణ, కె.ప్రవీణ్, ఆకుల వీరేశం, ఎం.ప్రదీప్‌కుమార్, జి.సత్తయ్య, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు



బొంరాస్‌పేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిచర్లలో పంచాయతీ వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. వీధిదీపాలకు ఆన్‌ఆఫ్ లేకపోవడంతో ప్రతీ రోజు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. ప్రతీనెల దాదాపు రూ.10వేలకు పైగానే విద్యుత్ చార్జీలు చెల్లిస్తున్నట్లు పంచాయతీ నుంచి సమాచారం. వేయి రూపాయలు ఖర్చు చేసి ఆన్‌ఆఫ్ బోర్డు ఏర్పాటు చేయిస్తే రూ.5వేల వరకు విద్యుత్ చార్జీలు ఆదా అవుతాయి. కానీ అలాంటిదేమి పట్టించుకోకుండా పంచాయతీ సిబ్బంది విద్యుత్ చార్జీలు చెల్లిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

సమ్మెను జయప్రదం చేయాలి

కొడంగల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మే 20న జరిగే దేశవ్యాప్త జాతీయ కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాస్, కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం కొడంగల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు.అనంతరం సీఐటీయూ మున్సిపల్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పకీరప్ప, ఉపాధ్యక్షుడిగా మొగులప్ప, కార్యదర్శిగా రమేశ్, సహాయ కార్యదర్శిగా మహేశ్, సుగుణమ్మ, ఉపాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, కోశాధికారిగా విజయ్‌కుమార్, కమిటీ సభ్యులుగా వెంకటప్ప, కిష్టప్ప, మొగులయ్యను ఎన్నుకున్నారు.

తవ్వారు.. వదిలేశారు!


మేడిపల్లిలో సీసీ రోడ్డును తవ్వి వదిలేసిన అధికారులు

యాచారం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి గ్రామంలో పది రోజులక్రితం తాగునీటి కోసం పైప్‌లైన్ బిగించడానికి సీసీ రోడ్డును తవ్వి వదిలేశారు. దాంతో రాత్రివేళ ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. శనివారం ఓ మహిళ రోడ్డుపైకి వెళ్లడానికి యత్నించడంతో ఆమె కాళ్లకు పగిలిన సిమెంట్ దిమ్మెలు తగిలి కిందపడి తీవ్రంగా గాయపడింది. రాత్రి వేళ బయటకు రావాలంటే ఎక్కడ కిందపడి గాయపడతామోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ఘనంగా ఈస్టర్ పండుగ

మోమిన్‌పేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు ఏసుక్రీస్తు బోధనలను వివరించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మర్పల్లి: మండల కేంద్రంలోని మెథడిస్టు చర్చితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండగను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల నుంచి శిలువ గుట్టలకు ఆదివారం ఉదయం పాటలు పాడుతూ భజనలు చేస్తూ తరలివెళ్లారు. అక్కడ సంఘ కాపరులు బైబిల్ వాక్యాన్ని చెబుతూ పాటలు పాడుతూ ఏసు ప్రభును స్తుతించారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి సంఘం కాపరి ప్రణీత్ కుమార్, సంఘ పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.


టేకులపల్లిలో ఈస్టర్ వేడుకల్లో క్రైస్తవ సోదరులు


చర్చి సంఘ కాపరి ప్రణీత్‌కుమార్‌ను సన్మానిస్తున్న మర్పల్లి మండల సంఘ పెద్దలు

ఘనంగా మల్లన్న స్వామి కల్యాణం


చౌదరిగూడ : మల్లన్న బోనాల ఊరేగింపులో భక్తులు

చౌదరిగూడ/శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల కేంద్రంలో మల్లికార్జున స్వామి(మల్లన్న) బోనాలు, కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. బీఆర్‌ఎస్ యువ నాయకులు మురళీయాదవ్, కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్‌లు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో బోనాలు ఊరేగింపు సాగింది. బీజేపీ సీనియర్ నాయకులు బోయ శంకర్, వీరయ్య, టి.ప్రేమ్‌కుమార్, శేఖర్, వెంకటేష్, జగన్, రామకృష్ణ, వేణుగోపాల్, శ్రీనివాస్, శ్రీకాంత్, బాల్‌రాజ్ మహిళలు పాల్గొన్నారు.

శంషాబాద్ మండలం పెద్దతూప్రలో మల్లన్న స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మశ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ, మండల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు ఆమె పేర్కొంది. మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి గౌస్‌పాషా, గ్రామ కమిటీ అధ్యక్షుడు విద్యచరణ్, అశోక్, బిక్యానాయక్, టి. దాసు, జయరాం, రాములు, కుమార్, రవి, గోవింద్ పాల్గొన్నారు.

కనుల పండువగా మైసమ్మ బోనాలు

నందిగామ : మండల పరిధిలోని చేగూర్‌లో ఆదివారం మైసమ్మ బోనాలు కనుల పండువగా నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు యువకులు తొట్టెలతో ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎంపీపీలు శివశంకర్‌గౌడ్, ప్రియాంక, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, మాజీ సర్పంచ్ పాండయ్య నాయకులు జంగ నర్సింలు, శ్రీశైలం, రాజశేఖర్, శివ, మల్‌రెడ్డి, బుచ్చయ్య, సాములయ్య, మల్లేష్, కావలి కృష్ణ, కొమ్ము క్రిష్ణ, కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయంలో పూజలు


ఆమనగల్లు : గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహారాజ్ అని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్త, మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు లచ్చిరామ్‌నాయక్ అన్నారు. ఆదివారం రాంజీ నాయక్ తండాలో ఉన్న సేవాఘాట్‌ను సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ సభ్యుడు బాచిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు వీరయ్య, మాజీ ఎంపీటీసీలు గోపాల్, చంద్రమౌళి, బీఆర్‌ఎస్ రావిచెడ్ సమన్వయ సమితి అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


శంషాబాద్ రూరల్: మల్లన్న స్వామి కల్యాణోత్సవంలో మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్ తదితరులు

నాగుల ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు

» 23 నుంచి 25 వరకు

అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన



వికారాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న నాగుల ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఈనెల 23 నుంచి 25 వరకు కొనసాగుతాయని గ్రామపెద్దలు తెలిపారు. గ్రామచెరువు సమీపంలో గుట్టపై పచ్చని చెట్ల మధ్య ఊరడమ్మ, ఈదమ్మ, ఎల్లమ్మ ఆలయాలు నూతనంగా నిర్మించినట్లు తెలిపారు. 23న గోపూజ, ధ్వజారోహణ, మంటప ప్రవేశం, అఖండ దీపారాధన, పుణ్యావాచనం, గౌరీపూజ, నాంది శ్రాద్ధం, భూశుద్ధి, రుత్విక్ వర్ణం, జలాధివాసం, బ్రహ్మాది మండలి, ఆవాహనం, యోగిని దేవత ఆవాహనం, అగ్ని ప్రతిష్ఠ, ధాన్యదివాసం, పుష్పాదివాసం, గణపతి నవగ్రహ దేవి హోమం, సామూహిక హోమాలు ఉంటాయన్నారు. 24న యంత్ర ప్రతిష్ఠ ప్రార్థన, ఆవాహిత దేవతా షోడోపచార పూజ, గర్త సంస్కారం, దాతు సంస్కారం, నేత్రోన్మీలనం, బలిప్రదానం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, చతుర్వేద సేవ, మంత్ర పుష్పము, తీర్థ ప్రసాద వితరణ కుంభ ఉద్వాసన సంప్రోక్షణం, మహా దాశీర్వచనం ఉంటుందని, 25న నాగుల ఎల్లమ్మ జాతర మహోత్సవం ఉంటుందన్నారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొనాలని గ్రామ పెద్దలు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



- ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఫేస్ టూ ఫేస్

ఆదిభట్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో ముందస్తు చర్యలు చేపట్టారు. వేసవి నేపథ్యంలో బోర్లు ఎండిపోతూ అక్కడక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. తాగునీరు, ఇంతర సమస్యలపై కమిషనర్ బాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: తాగునీటి సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : మున్సిపాలిటీలో 22వేలకు పైగా జనాభా ఉంది. అందుకనుగుణంగా మిషన్ భగరథ, హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి నీటి సరఫరా చేపడుతున్నాం. మున్సిపల్ పరిధిలో 100 బోరుపంపులు నడుస్తున్నాయి. దాంతోపాటు 15 వాటర్ ట్యాంకర్లు ఉన్నాయి. తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : నీటి వృథాపై ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు : వేసవిలో నీటిని వృథా చేయవద్దు. ఈ విషయమై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీఒక్కరు మున్సిపల్ అధికారుల సూచనలు పాటించాలి.

ప్రశ్న : ఎల్ఆర్ఎస్ కొరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జవాబు : ఎల్ఆర్ఎస్ కోసం ఇప్పటివరకు 17,600 దరఖాస్తులు వచ్చాయి. 15వేలు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు 3వేలకు పైగా పూర్తిచేశాం. అదేవిధంగా మిగిలినవి ఈనెల చివరి వరకు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈమేరకు రూ.18 కోట్ల ఫీజు వసూల్ కానుంది.

ప్రశ్న: పారిశుధ్య పనులు ఎలా చేపడుతున్నారు?

జవాబు : మున్సిపాలిటీలో 88 మంది సిబ్బంది నిత్యం పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నారు. చెత్తకోసం ఓనర్ కం డ్రైవర్ స్కీం కింద 9 ఆటోలు, మున్సిపల్‌కు సంబంధించిన 6ట్రాక్టర్లు, జేసీబీ, డోజర్‌ను వినియోగిస్తున్నాం. రోడ్లు, మురుగునీటి కాలువలు, ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యపరుస్తున్నాం.

ప్రశ్న: ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి చేశారా?

జవాబు : ఇంటి నిర్మాణంలో భాగంగా ఇంకుడుగుంత తప్పక నిర్మించాలి. రూల్స్ ప్రకారం నిర్మించిన వారికే ఇంటినెంబర్ ఇవ్వాలన్న నిబంధన ఉంది. ఇంకుడుగుంత నిర్మాణానికి చెల్లించిన ఫీజు వాపస్ ఇస్తాం.

ప్రశ్న: 2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను ఎంత వసూలైంది?

జవాబు : ఈ ఆర్థిక సంవత్సరం మున్సిపల్ టార్గెట్ రూ.4.40 కోట్లు. మున్సిపల్ అధికారులు, బిల్ కలెక్టర్లు 15 వార్డుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 86 శాతం పూర్తి చేశాం. ఆస్తి పన్ను వసూలులో ఉత్తమ ప్రతిభకు సీడీఎంఏ అచీవర్ అవార్డు కూడా అందజేసింది.

కొనుగోలు కేంద్రాలు ఓపెన్!

(5వ పేజీ తరువాయి)

పీఏసీఎస్ ద్వారా 26, డీసీఎంఎస్ ద్వారా 9 కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటికే 12 కేంద్రాలు ప్రారంభించారు. మిగతా కేంద్రాలు త్వరలలో ఓపెన్ కానున్నాయి. 30 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు రానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

గుబులు రేపుతున్న మబ్బులు

అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిచి మద్దతు ధర పలకదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో కొనుగోలు కేంద్రాల్లో అదనంగా టార్పాలిన్లు నిల్వ చేస్తున్నారు. కేంద్రాల్లో ఎక్కువ ధాన్యం నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు రవాణా చేసేందుకు సరిపడా వాహనాలను ఏర్పాటు చేశారు.

గతేడాది ఇలా..

గత ఏడాది యాసంగిలో 1,13,311 ఎకరాల్లో వరి సాగు చేయగా దానికి అనుగుణంగా 39 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 33 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 2,227 మంది రైతుల నుంచి 11,956.120 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. సవాలక్ష నిబంధనలతో ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



రన్‌ఫర్ జీసస్ కార్యక్రమంలో క్రైస్తవులు

చౌదరిగూడ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తును శిలువ వేసిన మూడోరోజున క్రైస్తవులు ఈస్టర్‌ను జరుపుకుంటారు. ఆదివారం కొందుర్గు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఈస్టర్ జరుపుకున్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధి తుమ్మలపల్లి, పెద్దఎల్కిచర్ల తదితర గ్రామాల్లో ఈస్టర్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొందుర్గులో రన్‌ఫర్ జీసస్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొయినాబాద్ మండల పరిధిలో క్రైస్తవులు ఈస్టర్‌ను జరుపుకున్నారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్

తలకొండపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దేవునిపడకల్, లింగరావుపల్లి, చెన్నారంలో అధికారులు ఆదివారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ సభలు నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన పనులు, ఖర్చుచేసిన నిధుల వివరాలను సభలో వెల్లడించారు. నివేదికను మండల అధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.

అతిథి గృహానికి నోచని ఆమనగల్లు

- ప్రతిపాదనలకే పరిమితం
- పునరుద్ధరణకు నోచుకోని అటవీ శాఖ గెస్ట్‌హౌజ్
- చొరవ చూపని నేతలు
- అతిథులు, అధికారులకు తప్పని ఇబ్బందులు



పునరుద్ధరణకు నోచుకోని అటవీశాఖ అతిథి గృహం(ఫైల్)

ఆమనగల్లు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం హామీలకే పరిమితమైంది. ప్రతిపాదనల్లోనే నిలిచింది. నాలుగు మండలాల ప్రధాన కూడలిగా, శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న ఆమనగల్లులో అతిథి గృహం లేక అతిథులు, పర్యాటకులు, ముఖ్యంగా ఉన్నతాధికారులు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ఇక్కడ ఉన్న నిజాం కాలం నాటి అటవీశాఖ అతిథి గృహాన్ని మావోయిస్టులు పేల్చివేశారు. ఆ తర్వాత మూడు దశాబ్దాలు గడిచినా అది పునరుద్ధరణకు నోచుకోలేదు. మండలంలో ఏ ఒక్క శాఖకూ అతిథిగృహం లేదు. జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు వచ్చినప్పుడు విశ్రాంతి, కాలకృత్యాలు తీసుకోవడానికి పడుతున్న ఇబ్బందులు చెప్పనలవి కావు. రాజకీయ నాయకులు, కార్యకర్తల ఇళ్లలోనే విలేకరుల సమావేశాలు, విశ్రాంతి తీసుకోవడం పరిపాటిగా మారింది. పట్టణంలో ఆర్అండ్‌బీ అతిథిగృహం నిర్మించాలని మండల సర్వసభ్య సమావేశాలలో అనేక పర్యాయాలు ఏక గ్రీవ తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదించినా స్పందన లేదు. గతంలో అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు అతిథి గృహ నిర్మాణానికి హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. పట్టణంలో అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి అనువుగా ఉన్నాయి. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని అర్అండ్‌బీ అతిథి గృహాన్ని నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం



ఆమనగల్లు పట్టణంలో ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం గురించి ప్రభుత్వానికి నివేదించాం. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిల ద్వారా మంత్రులను కలిసి అతిథి గృహ ఆవశ్యకత గురించి వివరించాం. గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ఎప్పుడైనా మంత్రులు, ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- మండ్లీ రాములు, ఆమనగల్లు

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి



అతిథి గృహం నిర్మాణానికి అనువైన స్థలం కేటాయించాలి. స్థల కేటాయింపు, నిర్మాణం విషయంలో ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి. పట్టణంగా అభివృద్ధి చెందిన ఆమనగల్లులో ఒక్క అతిథి గృహం కూడా లేకపోవడం శోచనీయం. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల పరిషత్ ఆధ్వర్యంలో అతిథి గృహం నిర్మాణానికి స్థలం అనువుగా ఉంది. ఆ దిశగా కృషి చేయాలి.

- విక్రమ్ రెడ్డి, ఆమనగల్లు

మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మల దహనం



ఆమనగల్లు : దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీల పేర్లను ఈడీ చార్జిషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌక్ దగ్గర మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మలను దగ్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, పర్వతాలు, ఖాదర్, ప్రసాద్, కృష్ణయ్య, కరీం, కానుగుల దశరథం, ఖండేసాయి, రఫీ, కుమార్‌గౌడ్, జగదీశ్, ఆనంద్, రాకేశ్, శివకుమార్, అనిల్, అంజయ్య, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ఎంపీ రాహుల్ గాంధీల పేర్లు చార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో ఆదివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ జెండాలు చేబూని నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన రహదారిపై బైటాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీం, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి నరేశ్, తలకొండపల్లి గ్రామాధ్యక్షుడు రమేశ్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శివ, నాయకులు రమేశ్, రాజేందర్, శ్రీను, సురేశ్, పురుషోత్తం, అంజి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరంలో మట్టి మాఫియా

(5వ పేజీ తరువాయి)

పైగా రైతులకు దాదాపు 350 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమిలో పలుగురాళ్లతో కూడిన గుట్ట ఉండటంతో వ్యవసాయానికి అనుకూలంగా లేదు. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు భూములను చదును చేస్తామని రైతులను ఒప్పించి పచ్చని చెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా కనిపించే తుమ్మలూరు గడ్డను అధునాతన యంత్రాలతో తూట్లు పొడుస్తున్నారు. అంతేకాకుండా ఆ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వి రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే వివిధ పార్టీల నాయకులు, మంత్రులు, అధికారుల పేర్లు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారు. భూముల చదును పేరుతో సుమారు కిలోమీటర్ల దూరం, 50 మీటర్ల లోతుకుపైగా గోతులు తవ్వి మట్టిని తరలిస్తున్నా అధికారులెవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు.

లోడుకు రూ.10వేలకు పైనే..

ఆయా గ్రామాల్లో తవ్విన మట్టిని ఇటుక బట్టీలకు, రియల్ వెంచర్లకు, నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు, భవన నిర్మాణాల ఉపయోగానికి విక్రయిస్తున్నారు. నల్లమట్టి ఒక లారీ లోడు సుమారు రూ.10 నుంచి రూ.13వేలకు విక్రయిస్తున్నారు. అలాగే పార్కులకు తరలించే ఎర్రమట్టి లారీ లోడును రూ.10 వేలకు అమ్ముకుంటున్నారు.



తుమ్మలూరు అసైన్డ్ భూమిలో మట్టిని తరలించడంతో ఏర్పడిన భారీ గోతులు

ధ్వంసమవుతున్న రోడ్లు..

మండలంలో ఆయా గ్రామాల మీదుగా మట్టిని తరలించే భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండటతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. భారీ గుంతలు ఏర్పడి ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొత్తగా వేసిన రోడ్లు కూడా కొద్ది రోజుల్లోనే పాడవతున్నాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు తప్పనిసరి

ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేస్తాం. ప్రభుత్వ ప్రయివేటు భూములు ఏవైనా సరే.. మట్టిని తరలించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలి.

- నర్సిరెడ్డి, ఏడీ, మైనింగ్ శాఖ

ఈదురు గాలుల వాన

(5వ పేజీ తరువాయి)

మారమ్మ అనే మహిళ ఇంటి రేకులు గాలికి ఎగిరిపడ్డాయి. గొల్లగూడలో ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుర్మిద్ద, తాటిపర్తిలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

దెబ్బతిన్న పంటలు

కందుకూరు : మండలంలోని లేమూరు, బైరాగిగూడ, గూడూరు గ్రామాల్లో కురిసిన ఈదురు గాలుల వానకు పంటలు దెబ్బతిన్నాయి. లేమూరులో రైతు మధుకర్‌రెడ్డికి చెందిన బొప్పాయి తోటలో చెట్లు పూర్తిగా నేలకొరిగాయి.

పిడుగుపాటుకు ఆవు, మేకల మృతి

కేశంపేట/ఆమనగల్లు : మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. భారీ శబ్దంతో పిడుగు పడడంతో వ్యవసాయ పొలం వద్ద చెట్టు కింద కట్టేసిన సత్యనారాయణకు చెందిన పాడి ఆవు మృత్యువాత పడింది. ఆవు మృతితో దాదాపు రూ.80వేలు నష్టం కలిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు. అలాగే పిడుగుపాటుకు నాలుగు మేకలు మృతి చెందాయి. ఆమనగల్లు మండలం కొత్తకుంట తండాలో ఆదివారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. కొత్తకుంట తండాకు చెందిన కేతావత్ శంకర్ వ్యవసాయ పొలం వద్ద చెట్టు కింద మేకలను ఉంచాడు. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ సందర్భంగా పిడుగుపాటుకు నాలుగు మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన మేకల విలువ రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని శంకర్ కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాల్‌లో ఈదురుగాలులకు పశువుల షెడ్లు కూలిపోయాయి.



కేశంపేట : మృతి చెందిన పాడి ఆవు వద్ద దిగాలుగా కూర్చున్న రైతు సత్యనారాయణ

రోడ్డుపై విరిగి పడిన చెట్లు

కడ్తాల్ : మండలంలో సుమారు రెండు గంటల పాటు ఈదురు గాలుల వర్షం కురిసింది. దీంతో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. గాలివాన బీభత్సానికి హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపడ్డాయి.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



శంషాబాద్ రూరల్ : కేక్ కట్ చేస్తున్న సుధాకర్‌గౌడ్

శంషాబాద్ రూరల్/ఆమనగల్లు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు పొలిజాల సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో భారీ కేక్ కట్‌చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మున్ముందు మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు సుధాకర్‌గౌడ్ తెలిపారు. తెలంగాణలో పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తున్నామని చెప్పారు. అలాగే చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆమనగల్లు పట్టణంలో అట్టహాసంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు కొప్పు యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్ ఎదుట కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. వృద్ధులు, మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటారు. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు కండే భాస్కర్, మారేపల్లి జంగయ్య, వెంకటస్వామిగౌడ్, పాండు, నరేశ్, లక్ష్మిపతి తదితరులు న్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకలకు ఆమనగల్లు మండలం నుంచి టీడీపీ నాయకులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు, ఆమనగల్లు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అర్థం నర్సింహ్మలు, సత్యనారాయణ, ఎస్.టి పంచాక్షరితదితరులు ఉన్నారు. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఆమనగల్లు మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీపరంగా చేపడుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడాలని ఆయన సూచించినట్లు నర్సిములు, యాదిలాల్, పంచాక్షరి తెలిపారు.



ఆమనగల్లు : మాట్లాడుతున్న అండేకార్ యాదిలాల్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కందుకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేదునూర్‌కు చెందిన నలుగురు లబ్ధి దారులకు మాజీ స ర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులందించారు. దీర్ఘకాలిక రోగగ్రస్తులకు సీఎంఆర్ఎఫ్ ఎంతో స హాయకారిగా ఉంటుందని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు మనోహర్, ఎండీ సలావుద్దీన్, ఎండీ ఇబ్రహీం, చంద్రమౌళీ, సమీర్, రాజు, గణేష్, ఆంజనేయులు తదితరులున్నారు.

మండ్లీ రాములుకు ఎంపీ పరామర్శ

ఆమనగల్లు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లీ రాములును ఆదివారం ఎంపీ మల్లు రవి పరామర్శించారు. ఇటీవల రాములు మాతృమూర్తి జంగమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. రవి శంకర్‌కొండ తండాకు చేరుకొని జంగమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

యాచారం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. మేడిపల్లి గ్రామానికి చెందిన యాదయ్య(44) శనివారం సాయంత్రం వరకు ట్రాక్టర్‌తో పొలం పనులు చేశాడు. రాత్రివేళ ఇంటినుంచి వెళ్లిపోయి నానక్‌నగర్ వెళ్లే దారిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు పోలీసుల దృష్టికి తేవడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణంరాజు చెప్పారు.

బిల్డింగ్‌పై నుంచి పడి యువకుడు..

శంకర్‌పల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి ఓ కూలీ మృతిచెందాడు. మోకిల సీఐ వీరబాబు కథనం మేరకు.. బీహార్‌కు చెందిన బికాస్‌కుమార్(24) నగరంలోని ఫిరోజ్‌గూడలో ఉంటూ వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో నాలుగైదు రోజుల నుంచి దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాల బాలుర వసతిగృహంలోని 6వ అంతస్తులో వెల్డింగ్ పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం వాటర్ ట్యాంకుకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు 6వ అంతస్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో తోటి కూలీలు శంకర్‌పల్లిలోని లలిత ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హోటల్‌కు కన్నం.. రూ.42వేలు చోరీ

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఓ హోటల్లో దుండగుడు చోరీకి పాల్పడి నగదును ఎత్తుకెళ్లిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హోటల్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో సర్వోత్తం అజీజ్ అనే ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎప్పటిలాగే శనివారం రాత్రి 12గంటల సమయంలో నిర్వాహకులు మూసివేసి ఇంటికి వెళ్లిపోయారు. అనంతరం ఓ వ్యక్తి హోటల్లోకి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.42వేలు ఎత్తుకెళ్లాడు. ఆదివారం ఉదయం నిర్వాహకులు వచ్చి చూసేసరికి హోటల్ కిటికీలు ధ్వంసమై ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూసేసరికి కౌంటర్‌లో ఉన్న నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి పరిశీలించగా నిందితుడు ముందుగా సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ బాక్సును ధ్వంసం చేసిన తరువాతనే చోరీకి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు సమీపంలోని దుకాణాల వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా, హోటల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు మొయినాబాద్ పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేద్దాం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషకరమని, పార్టీని మరింత బలోపేతం చేద్దామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామ మాజీ సర్పంచ్ మల్గారి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లారెడ్డి, ఎర్రోనికోటాల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు 100మంది ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యాదయ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మరింత కృషిచేయాలని సూచించారు. మల్లారెడ్డిగూడ, ఎర్రోనికోటాల అభివృద్ధికి నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు. చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మాలతికృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు మల్గారి మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గోపాల్, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, రాజు, మాధవరెడ్డి, మల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భిక్షపతి, మధుసూదన్‌రెడ్డి, రఘురాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌స్వామి తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అంజయ్య యాదవ్

కేశంపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్వాల గ్రామ పంచాయతీ ఎర్రగడ్డ తండాకు చెందిన భద్రునాయక్ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆదివారం ఎర్రగడ్డ తండాకు వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ శ్రీలత శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్, రాజేందర్, రాజు, మల్లేష్ యాదవ్, సత్యనారాయణ, కృష్ణ, సుదర్శన్, నారాయణలున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మండల పరిధిలోని తొమ్మిదిరేకులకు చెందిన కందెన జంగమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్ రూ.5వేలు, బీఆర్ఎస్ నాయకులు రూ.6వేలు మృతురాలి కుంటుబసభ్యులకు అందించారు. మాజీ సర్పంచ్ సావిత్రిబాల్‌రాజ్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యాదయ్య, నరసింహ, శ్రీరాములు, ఆంజనేయులు, బాలయ్య, యాదయ్య, జంగయ్య, మల్లేష్, పురుషోత్తంగౌడ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు నిజాలు తెలుసుకొని మాట్లాడాలి

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు

చౌదరిగూడ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం మండలంలో బీజేపీ నాయకులు గావ్‌చలో.. బస్తీచలో కార్యక్రమంలో భాగంగా సన్నబియ్యాన్ని మేమే(కేంద్రం) ఇస్తోందని చెబుతున్నారని, అన్నీ తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో గానీ, కేంద్రపాలిత ప్రాంతాల్లో గానీ ఎక్కడైనా సరే సన్నబియ్యం ఇస్తుందో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుంటే.. బీజేపీ ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తోందన్నారు.